అంగన్‌వేడి కేంద్రాలు

మేడ్చల్ జిల్లాలో 793 కేంద్రాలు.. 418 అద్దె భవనాల్లోనే..

- ఇరుకు గదులు, అద్దె భవనాల్లో కొనసాగుతున్న వైనం
- గాలి దూరని ఇరుకు గదుల్లో కనీస వసతులు కరువు
- ఇబ్బందుల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు
- ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టదా అంటున్న స్థానికులు

బోసినవ్వుల బుజ్జాయిలు.. అప్పుడే అమ్మఒడి నుంచి చదువులమ్మ ఒడిలోకి బుడిబుడి అడుగులు వేస్తున్నారు. పుట్టబోయే బిడ్డకు పౌష్టికాహారం కోసం అంగన్‌వాడీ వైపు చూస్తున్నారు గర్భిణులు. అయితే వారికి ఈ కేంద్రాలు సమస్యలతో స్వాగతం పలుకుతున్నాయి. గాలి చొరబడని ఇరుకు గదులు, పెచ్చులూడుతున్న గోడలు, పగిలిపోయిన ఫ్లోరింగ్, అరకొర సౌకర్యాలతో పాటు మరుగు దొడ్లు కూడా లేని అంగన్‌వాడీ కేంద్రాలు వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఇరుకు గదుల్లోనే చిన్నారులను ఉంచడంతో వారు అస్వస్థతకు గురవుతున్నారు. చాలా ప్రాంతాల్లో అసలు ఇవి అంగన్‌వాడీ కేంద్రాలేనా..? అనే దుస్థితిలో ఉన్నాయి. ఎన్నో ఏళ్లుగా చిన్నారుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నా పట్టించుకునే వారే లేకుండా పోయారు.



సాక్షి, మేడ్చల్ జిల్లా: మాతా, శిశు సంరక్షణలో భాగంగా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించడం, ఆరు నెలల నుంచి ఆరేళ్లలోపు వయసున్న పిల్లలకు ఆట పాటలతో కూడిన విద్య నేర్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. కానీ పలు కేంద్రాల్లో సమస్యలు తిష్ట వేశాయి. అద్దె భవనాల్లో కొనసాగుతున్న 418 అంగన్‌వాడీ కేంద్రాలు కనీస సమస్యల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. దీంతో చిన్నారులు, గర్భిణులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సొంత భవనాల నిర్మాణంపై ప్రభుత్వం దృష్టి సారించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఏళ్ల క్రితం భవనాలకు నిధులు మంజూరు కాగా, నిర్మాణాలు మధ్యలో నిలిచిపోయాయి. మరికొన్ని ప్రాంతాల్లో స్థలాల కేటాయింపు లేకపోవడం వల్ల నిర్మాణాలకు నోచుకోవడం లేదు.

అద్దె భవనాల్లో 418 అంగన్‌వాడీ కేంద్రాలు

మేడ్చల్ జిల్లాలో 793 అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. వీటిలో 211 కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలు ఉండగా, 163 అంగన్‌వాడీ కేంద్రాలు ప్రభుత్వ పాఠశాలలు, ఉచిత భవనాల్లో (కమ్యూనిటీ సెంటర్లు)లో నడుస్తున్నాయి. మిగతా 418 అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఈ కేంద్రాల్లో 11,302 మంది గర్భిణులు, బాలింతలు ఉండగా, 70,027 మంది ఆర్నెళ్ల నుంచి ఆరేళ్లలోపు చిన్నారులు ఉన్నారు. అద్దె భవనాల్లో నడుస్తున్న కేంద్రాలకు ప్రతినెలా అద్దె చెల్లిస్తున్నారు. కనీస సౌకర్యాలు లేని అద్దె ఇళ్లలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు.

పనులన్నీ ఒకేచోట..

చిన్నపాటి అద్దె గదిలోనే సామగ్రిని భద్రపర్చడం, వండిపెట్టడం, చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య అందించడం వంటి పనులన్నీ ఒకేచోటే నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. ఇరుకు గదులు చిన్నారులను ఊపిరి సలపకుండా చేస్తున్నాయి. మూత్రశాలలు, నీటి సరఫరా తదితర సౌకర్యాలు లేని ఇరుకైన అద్దె గదుల్లోని కేంద్రాలకు వెళ్లేందుకు నిరాసక్తత చూపుతున్నారు. దీంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో హాజరు శాతం పడిపోతుందనే వాదన వినిపిస్తోంది. అలాగే, జిల్లాలో 38 అంగన్‌వాడీ టీచర్లు, 158 అంగన్‌వాడీ సహాయకుల పోస్టులు ఖాళీ ఉన్నాయి. అద్దె భవనాల్లో నడుస్తున్న కేంద్రాలకు నూతన భవనాలను నిర్మించడంపై కూడా దృష్టి సారించటంతో పాటు అంగన్‌వాడీ సిబ్బంది ఖాళీలను త్వరగా భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని స్థానికులు కోరుతున్నారు.

క్లుప్తంగా...

అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయండి



సాయిదత్త కాలనీలో బ్యాక్స్ డ్రైనేజీ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ సబితకిషోర్

అల్వాల్: అభివృద్ధి నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని వెంకటాపురం డివిజన్ కార్పొరేటర్ సబితకిషోర్ అన్నారు. వెంకటాపురం డివిజన్ పరిధిలోని సాయిదత్త కాలనీలో రూ.1.2 లక్షలతో నిర్మిస్తున్న బ్యాక్స్ డ్రైనేజీ నిర్మాణ పనులను ఆమె సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈ అరుణ్, వర్క్స్ ఇన్‌స్పెక్టర్ వెంకట్రావు, కాలనీవాసులు, స్థానిక నాయకులు భాస్కర్, సుదేష్ తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు



అల్వాల్: తెలంగాణ మత్స్య కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన పట్టల రవీందర్‌ను తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కమిటీ నాయకులు డాక్టర్ చీమ శ్రీనివాస్, పి.సురేందర్‌రెడ్డి, కే.వీరాస్వామి అభినందనలు తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుడికి అవకాశం కల్పించినందుకు సీఎం కేసీఆర్‌కు వారు ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డును కూడా సీఎం కేసీఆర్ ఏర్పాటు చేస్తారనే ఆశతో తెలంగాణ ఉద్యమకారులందరూ ఎదురు చూస్తున్నారని తెలిపారు.

స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలి



నీటి నాణ్యతను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రభుదాస్

కుషాయిగూడ: డివిజన్ పరిధిలోని అన్ని కాలనీల్లో స్వచ్ఛమైన తాగునీటి సరఫరా జరిగేలా చూడాలని మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్ అధికారులకు సూచించారు. డివిజన్ పరిధిలోని హెచ్‌బీ కాలనీ ఫేజ్–2లో కలుషిత జలాల సరఫరాపై ఫిర్యాదు అందుకున్న కార్పొరేటర్ సోమవారం కాలనీకి వెళ్లి తాగునీటి నాణ్యతను పరిశీలించారు. పలుచోట్ల డ్రైనేజీ, లీకేజీల మూలంగా మంచినీరు కలుషితం అవుతున్నట్లు గుర్తించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి కలుషిత జలాల సరఫరాను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ మేనేజర్ వేణుగోపాల్, స్థానికులు చంద్రమోహన్, రాజు, వెంకటేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సిటీ మార్కెట్లోకి నైట్రోఫ్లై షూస్

సాక్షి, సిటీబ్యూరో: స్పోర్ట్స్ అథ్లెయిజర్ ఫుట్‌వేర్ బ్రాండ్‌లలో ఒకటైన క్యాంపస్ యాక్టివేర్, తమ నైట్రోఫ్లై శ్రేణిని సిటీ మార్కెట్లోకి విడుదల చేసింది. 'వై రన్ వెన్ యు కెన్ ఫ్లై' అనే ట్యాగ్‌లైన్‌తో ఫాస్ట్ బౌలర్ ఉమ్రాన్ మాలిక్‌తో ఈ ఉత్పత్తి కోసం భాగస్వామ్యం చేసుకున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ షూస్ అత్యాధునిక సాంకేతికత, విప్లవాత్మక నైట్రో టెక్నాలజీలతో రూపొందాయని వివరించారు.

గృహిణి ఆత్మహత్య



పద్మ (ఫైల్)

కుషాయిగూడ: మనస్థాపంతో ఓ గృహిణి ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందిన ఘటన సోమవారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ ఉపేందర్‌యాదవ్ వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా, నార్కట్‌పల్లి మండలం, చిన్నతుమ్మలగూడెం గ్రామానికి చెందిన బత్కా ఐలయ్య, పద్మ(35) బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి కూలి పనిచేసుకుంటూ ఏపీఐఐసీ కాలనీలో నివాసం ఉంటున్నారు. కొన్ని రోజులుగా అప్పుల బాధతో సతమతమవుతున్నారు. ఈ క్రమంలో భర్త పనిపై ఆదివారం సొంతూరు వెళ్లాడు. కొడుకు నిద్రిస్తున్నాడు. ఈ సమయంలో అప్పుల గురించి మనస్థాపం చెందిన పద్మ సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

హాట్ టాపిక్స్

మంత్రి మల్లారెడ్డికి మహిళల నుంచి నిరసన సెగ



మేడ్చల్: మంత్రి మల్లారెడ్డికి మేడ్చల్ మున్సిపాలిటీలోని గిర్మాపూర్‌లో మహిళల నుంచి నిరసన సెగ తగిలింది. గిర్మాపూర్‌లో మంత్రి సోమవారం బస్తీ దవఖానా ప్రారంభోత్సవానికి వెళ్లగా మంత్రిని గ్రామానికి చెందిన మహిళలు, కాంగ్రెస్ నాయకులు చుట్టుముట్టి నిలదీశారు. రైతుబంధు రావడం లేదని, దళిత బంధు అడ్రస్ లేదని, డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు చేయడం లేదని, పింఛన్లు రావడం లేదని మంత్రిని నిలదీశారు. మంత్రి కాన్వాయ్‌కి ఎదురుగా నిలబడి మంత్రిని ప్రశ్నించారు. వారిని పోలీసులు, బీఆర్ఎస్ నాయకులు అడ్డుకుని వారించారు. గిర్మాపూర్‌లో ఎలాంటి అభివృద్ధి జరగడం లేదని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి కార్లో కూర్చోగానే మహిళలు కారు వద్దకు వెళ్లడంతో ఒక్కసారిగా గందరగోళ పరిస్థితి నెలకొంది.

మునీరాబాద్ సర్పంచ్, ఉపసర్పంచ్‌ల రాజీనామా

- అధికారుల తీరు నిరసిస్తూ రాజీనామా చేస్తున్నట్లు ప్రకటన
- గతంలో ఉత్తమ గ్రామ పంచాయతీగా మునీరాబాద్‌కు అవార్డు

మేడ్చల్‌రూరల్: అధికారుల తీరును నిరసిస్తూ మండలంలోని మునీరాబాద్ గ్రామ సర్పంచ్ చిట్టిమిల్ల గణేశ్, ఉపసర్పంచ్ నర్సింగ్‌రావు తమ పదవులకు రాజీనామా చేశారు. ఈ మేరకు జిల్లా పంచాయతీ అధికారికి సోమవారం తమ రాజీనామా పత్రాలను అందజేశారు. గ్రామాన్ని తమ పాలకవర్గం ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని అహర్నిశలు పాటు పడుతుండగా గ్రామ కార్యదర్శి ప్రమీలాదేవి ప్రతి పనికీ లంచం తీసుకుంటూ గ్రామాన్ని లంచాలలో ఆదర్శంగా నిలిపేందుకు ప్రయత్నిస్తున్నారని, ఈ విషయంపై జిల్లా కలెక్టర్, డీపీఓ, ఎంపీడీఓ, ఎంపీఓ, జిల్లా, మండలస్థాయి అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేదంటూ నిరసన వ్యక్తం చేస్తూ రాజీనామా చేస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్న పాలకవర్గానికి సహకారం అందించాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకపోవడంతోనే ఆవేదనతో రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. కాగా మునీరాబాద్ గ్రామ పంచాయతీ జిల్లా, మండల స్థాయిలో ఉత్తమ గ్రామ పంచాయతీగా అవార్డు పొందింది. ఉత్తమ గ్రామ పంచాయతీ సర్పంచ్, ఉపసర్పంచ్‌లు తమ పదవులకు రాజీనామా చేయడం మండలంలో హాట్ టాపిక్‌గా మారింది.

గన్నీ బ్యాగుల కోసం రైతన్నల నిరీక్షణ



పూడూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద బ్యాగుల కోసం నిరీక్షిస్తున్న రైతులు

మేడ్చల్‌రూరల్: ధాన్యం కొనుగోలు కేంద్రంలో గన్నీ బ్యాగులు (గోనె సంచులు) ఇవ్వడం లేదని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పూడూర్ ఆదర్శ రైతు సేవా సహకారం సంఘంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద సోమవారం పలు గ్రామాల రైతులు నిరసన వ్యక్తం చేశారు. తాము పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంకు తీసుకువచ్చేందుకు అధికారులు సకాలంలో గన్నీ బ్యాగులు ఇవ్వడం లేదని, సంచుల కొరత ఉందంటూ తమకు ఇవ్వకపోవడంతో అకాల వర్షాల కారణంగా తమ ధాన్యం తడిసిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గన్నీ సంచుల కోసం రోజుల పాటు వేచి ఉండాల్సి వస్తుండటంతో చేతికి వచ్చిన పంట వర్షాల కారణంగా నష్టపోతున్నామని తెలిపారు. కొనుగోలు కేంద్రంలో అధికారులు తమకు అనుకూలంగా ఉన్న వారికి మొదటి ప్రాధాన్యతలో బ్యాగులు అందజేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ప్రతీ గింజను కొంటాం అని చెప్పుకుంటున్న ప్రభుత్వం వెంటనే రైతులకు సరిపడా గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచి తమ సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

యూజీడీ పనులు ప్రారంభం



మేడ్చల్: పట్టణంలోని 13వ వార్డులో రూ.7 లక్షలతో చేపట్టిన యూజీడీ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ దీపికనర్సింహారెడ్డి కౌన్సిలర్ మర్రి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. పట్టణంలో సంపూర్ణ భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు, అన్ని వార్డుల్లో సీసీ, బీటీ రోడ్ల నిర్మాణాలకు ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో కమిషనర్ త్రిలేశ్వర్‌రావు, ఆర్ఓ రాంచందర్, సానిటరి ఇన్‌స్పెక్టర్ శంకర్ పాల్గొన్నారు.

వెంబడించి దాడి చేసిన యువకుల అరెస్ట్

పోచారం: పాత కక్షల నేపథ్యంలో ఓ వ్యక్తితో పాటు మరో ఇద్దరిని వెంబడించి దాడి చేసిన ఘటనలో ఇద్దరు యువకులను ఘట్‌కేసర్ పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. ఏదులాబాద్‌కు చెందిన సాల్వేరు చిత్తంరావు కొంతకాలంగా నగరంలో ఉంటున్నాడు. ఆదివారం మధ్యాహ్నం గ్రామంలోని డీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఓ వివాహ వేడుకలో చిత్తంరావుతో పాటు గద్దం రవి, దాత్రిక కార్తీక్ హాజరై తిరిగి వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన సాల్వేరు నిఖిలేష్(28), సాల్వేరు చిత్తరంజన్(21)తో పాటు మరో ఇద్దరు యువకులు ఇనుప రాడ్లతో కారు అద్దం ధ్వంసం చేశారు.దీంతో బాధితులు పరుగులు తీశారు. అయినప్పటికీ వెంబడించడంతో ఘట్‌కేసర్ పోలీసులను ఆశ్రయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు.

ఓటరు నమోదుపై అవగాహన

పోచారం: ఓటరు నమోదుతో పాటు ఓటర్ల జాబితాపై పోచారం మున్సిపల్ కార్యాలయంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వివిధ పార్టీలకు చెందిన నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. ఓటరు జాబితాపై ఎలాంటి అభ్యంతరాలున్నా మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని చైర్మన్ కొండల్‌రెడ్డి, కమిషనర్ సురేష్ కోరారు.

ఎన్ఎస్‌యూఐ పదవికి రాజీనామా

పోచారం: ఎన్ఎస్‌యూఐ ఘట్‌కేసర్ మున్సిపాలిటీ అధ్యక్ష పదవితో పాటు ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు చందుపట్ల సాయిచరణ్‌రెడ్డి సోమవారం తెలిపారు. వ్యక్తిగత సమస్యల వల్ల పార్టీ నుంచి వైదొలగుతున్నట్లు చెప్పారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

జవహర్‌నగర్: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జవహర్‌నగర్ మేయర్ మేకల కావ్య అన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ 2.0 పురస్కరించుకొని మేరీ లైఫ్, మేరా స్వచ్ఛ షెహర్ కార్యక్రమంలో భాగంగా జవహర్‌నగర్‌లో ఆర్ఆర్ఆర్ (రెడ్యూస్, రీయూస్, రీసైకిల్) సెంటర్లు ఏర్పాటు చేసి సెంటర్లు నిర్వహించే స్వయం బృందాల సభ్యులకు సోమవారం ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 5వ తేదీ వరకు జవహర్‌నగర్‌లోని బాలాజీనగర్ డ్వాక్రా భవన్, అంబేద్కర్‌నగర్ డ్వాకా భవన్‌లో ఈ ఆర్ఆర్ఆర్ సెంటర్లు అందుబాటులో ఉంటాయని, ప్రజలు సేవలను వినియోగించుకోవాలని కోరారు. సెంటర్లలో సేకరించిన వస్తువులు, పుస్తకాలు, పాత బట్టలు, వంటి ఇతర వస్తువులను పునరుద్దరించడం, పునఃప్రారంభిచడం, రీసైకిల్ చేయడానికి సంస్థలను గుర్తించి సేకరించిన వస్తువులు ఉపయోగంలోకి వచ్చేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ రామలింగం, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, కార్పొరేటర్లు బింగి లావణ్యసతీష్‌గౌడ్, మేక లలితయాదవ్, రాంచందర్, నవీన్‌కుమార్, కో–ఆప్షన్ సభ్యులు, స్వయం బృందాల సభ్యులు, వాలంటీర్లు, ఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్య రక్షణే ధ్యేయంగా ప్రభుత్వం కృషి



బస్తీ దవాఖానా ప్రారంభోత్సవంలో మంత్రి మల్లారెడ్డి

బోడుప్పల్: తెలంగాణ ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్య రక్షణే ధ్యేయంగా కృషి చేస్తోందని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. చెంగిచర్ల 2వ డివిజన్ పరిధిలోని ఇందిరానగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతి ఒక్కరికీ వైద్యం అందించాలనే లక్ష్యంతో బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. విద్య, వైద్యం, మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. కార్యక్రమంలో మేయర్ సామల బుచ్చిరెడ్డి, కమిషనర్ వాణిరెడ్డి, డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీరవిగౌడ్, బీఆర్ఎస్ అధ్యక్షుడు మంద సంజీవ్‌రెడ్డి, కార్పొరేటర్ కొత్త చందర్‌గౌడ్, డీఎంహెచ్ఓ శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యులు రంగ బ్రహ్మన్నగౌడ్ పాల్గొన్నారు.

మహిళల భద్రతకు పెద్దపీట

సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర



అల్వాల్ పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న సీపీ స్టీఫెన్ రవీంద్ర

అల్వాల్: మహిళల భద్రతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర అన్నారు. సోమవారం అల్వాల్ పోలీస్ స్టేషన్‌లో సెంటర్ ఆఫ్ డెవలప్‌మెంట్ ఎంపవర్‌మెంట్ ఉమెన్ (సీడీఈడబ్ల్యూ) కౌన్సిలింగ్ సెంటర్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేఫ్ సిటీలో భాగంగా కుటుంబ సమస్యల పరిష్కారానికి కౌన్సెలింగ్ ద్వారా కృషి చేస్తున్నామన్నారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో కుటుంబ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న భార్యాభర్తలకు ఫ్యామిలీ కౌన్సెలింగ్ ద్వారా సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తున్నామన్నారు. కుటుంబంలో ఆర్థిక సమస్యలతో పాటు భార్యాభర్తల మధ్య సఖ్యత లేకపోవడానికి గల కారణాలను గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇచ్చి వారి ఇబ్బందులను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. భార్యాభర్తలకు సెంటర్‌లో రెండు, మూడుసార్లు కౌన్సెలింగ్ నిర్వహించి వారిలో మార్పు వచ్చేలా కృషి చేస్తున్నట్లు వివరించారు. కుటుంబాలు సురక్షితంగా ఉండేందుకు కౌన్సెలింగ్ ఉపయోగపడుతుందన్నారు. ఇప్పటికి ఇక్కడికి వచ్చిన 70 కేసుల్లో 30 కేసులను పరిష్కరించామని, మిగిలిన కేసులను దశలవారీగా పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. సైబరాబాద్ పరిధిలోని అల్వాల్, పేట్ బషీరాబాద్, జీడిమెట్ల, మోకిల, ఆర్‌సీపురంతో పాటు మరో రెండు సెంటర్లను ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో ఉమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీ నికిత్‌పంత్, ఏసీపీలు రామలింగరాజు, వెంకట్‌రెడ్డి, సీఐ గంగాధర్, కౌన్సిలర్లు భవాణి, అర్చన తదితరులు ఉన్నారు.

పీర్జాదిగూడలో శానిటేషన్ డ్రైవ్



పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న కమిషన్ వంశీకృష్ణ, కార్పొరేటర్ మద్ది యుగేందర్‌రెడ్డి

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ బుద్దానగర్ 11వ డివిజన్‌లో సోమవారం ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌ను నిర్వహించారు. డివిజన్‌లోని ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన చెత్త, రోడ్లకు ఇరువైపులా పరిసరాలను శుభ్రంచేసి, కాల్వల్లో ఉన్న మురుగును తొలగించి జేసీబీతో తొలగించారు. చెత్తను ట్రాక్టర్ ద్వారా డంపింగ్ యార్డుకు తరలించారు. డివిజన్‌లో ఉదయం ప్రారంభించిన శానిటరీ ప్రత్యేక కార్యక్రమంలో కమిషనర్ వంశీకృష్ణ, కార్పొరేటర్ మద్ది యుగేందర్‌రెడ్డి పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని డివిజన్లలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్స్‌పెక్టర్ జానకి, కాలనీ వాసులు ప్రమోద్‌రెడ్డి, శ్యామ్‌గుప్తా, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి శవం లభ్యం

పోచారం: అన్నోజిగూడలో క్వారీ గుంతలో ఆదివారం గల్లంతైన అంకిరెడ్డి మహేష్ మృతదేహం సోమవారం లభ్యమైంది. మృతుడి తల్లి లక్ష్మి మాట్లాడుతూ మహేష్ ఓ అమ్మాయిని ప్రేమించాడని, గొడవలు జరిగాయని, ఈ క్రమంలోనే మహేష్‌ను చంపారన్నారు. పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

మచ్చబొల్లారంలో అభివృద్ధి పనులు ప్రారంభం



మచ్చబొల్లారంలో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన పరిధిలోని అన్ని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని స్థానిక కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్ అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని తుర్కపల్లిలో జరుగుతున్న అంతర్గత రోడ్డు నిర్మాణ పనులు, సాయినగర్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలలో ప్రజలకు అవసరమయ్యే మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఈఈ రాజు, డీఈ మహేష్, ఎస్ఎస్ ప్రభాకర్, ఏఈ రవళి, నాయకులు బొబ్బిలి సురేందర్‌రెడ్డి, పరమేష్, శోభన్, వెంకటేష్, అనిల్‌గౌడ్, నవీన్, యాదిరెడ్డి, ప్రవీణ్, కిట్టు, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే చర్లపల్లి పోలీస్‌స్టేషన్ ప్రారంభోత్సవం



చర్లపల్లిలో పోలీస్‌స్టేషన్ భవనాన్ని పరిశీలిస్తున్న రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్, డీసీపీ జానకీ

కుషాయిగూడ: నూతనంగా మంజూరైన చర్లపల్లి పోలీస్‌స్టేషన్ త్వరలోనే అందుబాటులోకి వస్తుందని రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ తెలిపారు. చర్లపల్లిలో పోలీస్‌స్టేషన్ ఏర్పాటు కోసం నిర్ణయించిన భవనాన్ని ఆయన డీసీపీ జానకీతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసమే ఈ నూతన పోలీస్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించినట్లు ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. అనంతరం పారిశ్రామికవేత్తలతో ఆయన మాట్లాడారు. ఆయన వెంట కుషాయిగూడ ఏసీపీ వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.